# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  27-12-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు రాష్ట్ర మంత్రులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
- పర్యావరణానికి మేలు చేసే సౌర విద్యుత్ పథకం "పీఎం సూర్య ఘర్"ను అందరూ సద్వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు.

==========================

పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి... వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన  ప్రగాఢ సానుభూతి తెలిపారు.  అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ మరణం ఎంతో  బాధాకరమని, ఆయన దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తో సహా పలువురు తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులు మన్మోహన్ సింగ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

==========================

పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు రాష్ట్ర మంత్రులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆయనకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని అన్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతి ఎంతో బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు అన్నారు. 10 సంవత్సరాల పాటు భారత ప్రధానమంత్రిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు అని అచ్చెనాయుడు పేర్కొన్నారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన చేసిన ఆర్థిక సంస్కరణల నుంచి ప్రధానమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మన్మోహన్ సింగ్ మృతి పట్ల తన సంతాపాన్ని తెలియజేస్తూ... ఆయన మరణం దేశానికి తీరని లోటని, 10 సంవత్సరాల పటు దేశ ప్రధానిగా మన్మోహన్ గొప్ప సేవలు అందించారని అన్నారు.

==========================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోనే అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెదమామిడిపల్లిలో జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలకొల్లు నియోజకవర్గంలోని మూడు గ్రామాల్లో 3 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరా, పెన్షన్ పెంపుతో పాటు, ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

==========================

రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1వ తేదీ నుంచి సబ్ ట్రెజరీలు, జిల్లా ట్రెజరీలో స్వీకరిస్తామని విజయనగరం జిల్లా ఖజానా అధికారి ఆర్.ఏ.ఎస్.కుమార్ తెలిపారు. ఆన్ లైన్ లో బయోమెట్రిక్ విధానం, అలాగే జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా పెన్షనర్లు తమ సర్టిఫికెట్లు సమర్పించవచ్చన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయడంలో అవసరమైన సహాయ సహకారాలు అందించడం కోసం ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు అవకాశం వుందని ఆయన తెలియజేశారు

విరామం

==========================

భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.వి. ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా 10వ తరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దీనికి అర్హులుగా తెలిపారు. జనవరి 7 నుంచి 27వ తేదీ లోగా agnipathvayu.cdac.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఇతర వివరాలకు భారత వాయుసేన వారి వెబ్ సైట్ ను సందర్శించాలని తెలియజేశారు.

==========================

భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడంతో పాటు, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతున్న "ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ" పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈరోజు కలెక్టర్ అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో పీఎం సూర్యఘర్ పథకం లబ్ధిదారు ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం అమల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపి ఆదర్శంగా నిలవాలని అన్నారు. పర్యావరణానికి, ఆరోగ్యకర జీవితానికి మేలుచేసే పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా, అందరూ సౌర విద్యుత్‌ను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో "సూర్య ఘర్ పథకం"పై ప్రత్యేక దృష్టి సారించామని తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

ఆర్థిక సంస్కరణల సారథి, ప్రపంచం మెచ్చిన రాజనీతిజ్ఞుడు భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప మేధావిని, ఆర్థిక శాస్త్ర నిపుణున్ని కోల్పోయిందని పద్మశ్రీ పురస్కారగ్రహీత ప్రముఖ వైద్యనిపుణులు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. 2008లో అప్పటి భారత ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ సమక్షంలో పద్మశ్రీ  పురస్కారాన్ని అందుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రధానిగా ఆయన తెచ్చిన సంస్కరణల వల్ల ఈరోజు భారత్ ప్రపంచంలో ఒక గొప్ప ఆర్థిక శక్తిగా ఎదగడం ముదావాహమని ప్రస్తుతిస్తూ.. డాక్టర్ కూటికుప్పల సూర్యారావు మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తపరిచారు.

==========================

దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ లో రూపొందించామని శాప్ చైర్మన్  అనిమిని రవినాయుడు వెల్లడించారు. విజయవాడలో శాప్ ఆధ్వర్యంలో జరుగుతున్న సీనియర్ వాలీబాల్ టీమ్ సెలక్షన్ పై ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...  క్రీడారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, దీనిలో భాగంగానే అనేక క్రీడా సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఆ దిశగా క్రీడామైదానాల ఏర్పాటుకు జీవోలు జారీ చేశారన్నారు. "ఖేలో ఇండియా" ద్వారా నిధులు సమకూర్చి ఆంధ్రప్రదేశ్ లో క్రీడారంగాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామన్నరు.

==========================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఏడాది చివరలో నిర్వహించే అత్యంత సుదీర్ఘమైన అధ్యయనోత్సవాలు ఈనెల 30 నుండి జనవరి 23వ తేదీ వరకు తిరుమల ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణంగా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా శ్రీవారి సన్నిధిలో దివ్యప్రబంధ పాసుర పారాయణంగా పిలిచే ఈ అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

==========================

రక్తహీనత రహిత జిల్లాగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని పనసభద్ర గ్రామంలో ఈరోజు రక్తహీనత నివారణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనతతో ఉన్న గర్భిణీలు, మహిళల నివేదికలను ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ... సరైన పోషకాహారం తీసుకోకపోవడం వలన జిల్లాలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉందని, అన్నారు. గ్రామంలోని రక్తహీనత గల  గర్భిణీలను, మహిళలను గుర్తించి వారికి అవసరమైన ఇంజక్షన్లు, మందులను ఇవ్వడం ద్వారా సమస్యను అధిగమించవచ్చని అధికారులకు సూచించారు.

==========================
==========================